ప్రజాశక్తి
గురువారం 4 ఏప్రిల్ 2024
8 పేజీలు




విశాఖపట్నం అనకాపల్లి

విఎంఆర్‌డిఎ భూమి ఆక్రమణ



విఎంఆర్‌డిఎ భూమిలో ప్రైవేటు వ్యక్తులు నరికేసిన టేకు చెట్లు

- టేకు చెట్లు నరికివేత
- రూ.60 కోట్ల విలువైన ఆస్తి ప్రయివేటు వ్యక్తుల పరం
- పట్టపగలే భారీ యంత్రంతో చదును
- సకాలంలో స్పందించని అధికారులు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, పరవాడ విలేకరి

పరవాడ మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌కు ఎదురుగా ఉన్న విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (విఎంఆర్‌డిఎ)కి చెందిన దాదాపు రూ.60 కోట్లు విలువైన సుమారు 6.76 ఎకరాల భూమిని ప్రయివేటు వ్యక్తులు ఆక్రమిస్తున్నా అధికారులకు చీమకుట్టినట్లయినా లేదు. దొంగలు పడ్డ ఆర్నెళ్లకు కుక్క మొరిగినట్లు భూమిని చదును చేసి, లక్షల రూపాయల విలువైన టేకు చెట్లు అమ్మేసి, పూర్వకాలం నాటి తాటి చెట్లు నేలమట్టం చేసిన వారం రోజులకుగానీ స్పందించలేదు. విఎంఆర్‌డిఎలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి సహకారం ఆక్రమణదారులకు మరింత బలాన్ని ఇచ్చింది. సొంతభూమిని చదును చేస్తున్నట్లు పట్టపగలు భారీ యంత్రంతో గట్లు తీసేసి, ఇక్కడ చదును చేస్తున్నారు. ఆక్రమణలకు పాల్పడిన వ్యక్తులు టిడిపికి చెందినవారైనా, వారి వెనుక వైసిపి నాయకుల హస్తముంది. ఇరు పార్టీల నాయకులు కలిసి ఎన్నికల హడావుడిలో ఎవరూ పట్టించుకోరని భావించి విఎంఆర్‌డిఎ భూమిని హస్తగతం చేసుకొని అమ్మకానికి సిద్ధంచేస్తున్నారు. చదునుచేస్తున్న భూమి దగ్గరకు వేరెవరూ రాకుండా కొంతమందిని పెట్టుకున్నారు. స్థలం దగ్గరకు వెళ్లినవారికి ఫొటోలు తీసి పంపించే ఏర్పాట్లు ఆక్రమణదారులు చేసుకున్నారు. ఆక్రమిస్తున్న భూమి దగ్గరకు వెళ్లడానికి భయానక వాతావరణాన్ని ఆక్రమణదారులు సృష్టించారు.

ఇంతకీ ఏం జరిగింది ?

1992లో మండల కేంద్రంలోని ఈదులపాక బోనంగి రెవెన్యూలోని సర్వే నెంబర్ 224లో 16.76 ఎకరాల భూమిని 27 మంది రైతుల నుంచి అప్పటి వుడా (విఎంఆర్‌డిఎ) సేకరించింది. 1994లో అవార్డు అయింది. రైతుల నుంచి సేకరించిన ఈ భూమిలో మిగతా 2లో..



తిమ్మరాజుపేట సచివాలయం వద్ద పింఛన్ కోసం వేచిచూస్తున్న లబ్ధిదారులు



ముసలయ్యపాలెంలో పింఛన్ తీసుకునేందుకు కష్టంమీద వస్తున్న వృద్ధురాలు

పింఛన్ల కోసం పడిగాపులు

సచివాలయాల వద్ద కానరాని సౌకర్యాలు

వృద్ధులు, వికలాంగులకు ఇబ్బందులు

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో బుధవారం సకాలంలో లబ్ధిదారులకు పింఛన్ అందలేదు. ఉదయం 11 గంటల నుంచి పింఛన్ పంపిణీ చేస్తారని లబ్ధిదారులు సచివాలయాలకు తరలివచ్చారు. చాలా చోట్ల మధ్యాహ్నం 3 గంటల తరువాతే పింఛన్ల పంపిణీ మొదలైంది. దూర ప్రాంతాల్లో ఉన్న వృద్ధులు, వికలాంగులు పింఛన్ తీసుకునేందుకు సచివాలయానికి రావడానికి ఇబ్బందులు పడ్డారు. కొంత మంది ఆటోలు, బస్సుల్లో సహాయకులతో కలిసి వచ్చారు. సచివాలయాల వద్ద టెంట్లు, తాగునీటి సౌకర్యం వంటివేవీ కానరాలేదు. చాలాసేపు పడిగాపులు కాసారు.

(వార్తలు 8లో..)

గల్లంతైన మత్స్యకారులు క్షేమం

▶ వార్త మెయిన్‌లో..

ర్యాగింగ్‌పై సిఎంకు ఫిర్యాదు

▶ వార్త 2లో..

రూపశ్రీ మృతి కేసులో న్యాయం జరిగేలా చూస్తాం

▶ వార్త 3లో..



షాట్ కొడుతున్న సునీల్ నరైన్

కోల్‌కతా పరుగుల వరద

ఢిల్లీపై భారీ విజయం

వార్త 2లో..

'కూటమి' ఇరకాటంలో పడుతోందా ?

- ఆందోళనలో టిడిపి, జనసేన అభ్యర్థులు
- విశాఖలోని 4 అసెంబ్లీ సెగ్మెంట్లలో పలు పరిణామాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థుల్లో సార్వత్రిక ఎన్నికల ఆందోళన పెరుగుతోంది. బిజెపితో పొత్తు పెట్టుకున్న కారణంగా ఓ వైపు దళిత, గిరిజన, బిసి కులాలు, మైనారిటీల ఓట్లకు గండి పడనుందన్న ప్రచారం, మరోవైపు టికెట్ల రాని వారంతా ఏం చేస్తారోనన్న భయం కూటమి అభ్యర్థుల్లో నెలకొని ఉంది. నగరంలోని నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రస్తుతం ఇదే పొలిటికల్ టాపిక్‌గా మారిపోయింది.

దక్షిణం అసెంబ్లీ సెగ్మెంట్‌ను చూస్తే కూటమి అభ్యర్థిగా వంశీకృష్ణ శ్రీనివాస్ జనసేన నుంచి బరిలో ఉన్నారు. ఇప్పటికే ప్రచారం నిర్వహిస్తున్నారు. అక్కడ వైసిపి అభ్యర్థిగా సిట్టింగ్ ఎంఎల్‌ఎ వాసుపల్లి ఉన్నారు. ఈ ఇద్దరికీ వ్యతిరేకంగా పలువురు కార్పొరేటర్లు తమకైనా టికెట్ కావాలని, లేదంటే తాము సూచించే వారికైనా టికెట్ ఇవ్వాలంటూ టిడిపి, జనసేనపై ఒత్తిడి తెచ్చిన సంగతి తెలిసిందే. వాసుపల్లికి వ్యతిరేకంగా నిలబడ్డ సీతంరాజు సుధాకర్ తెలుగుదేశం పార్టీ తరపున టికెట్ ఆశించి భంగపడ్డారు. చివరకు కూటమికి చెందిన వంశీకృష్ణకు మద్దతుగా బుధవారం నుంచి ప్రచారంలో పాల్గొంటున్నారు. ఆయనతో గతంలో ఉండే కార్పొరేటర్లంతా వాసుపల్లి పంచన కొంతమంది, వంశీపక్కకు కొంతమంది వచ్చి చేరిపోవడంతో సీతంరాజు వద్ద విల్లూరి, ఉరుకూటి ఇద్దరే మిగిలారు. దీంతో చేసేది లేక కూటమికి ఆయన జై కొట్టారు. ఆయన సహకారం ఏమేరకు ఉంటుందో వేచిచూడాలి. ఇదే నియోజకవర్గానికి చెందిన జనసేన నాయకుడు, కార్పొరేటర్ కందుల నాగరాజు టికెట్ ఆశించి భంగపడ్డారు. ఇంకా ఏపక్షాన ఉండాలో ఆయన నిర్ణయించుకోలేకపోవడం దక్షిణంలో కూటమికి ఇరకాటం కాగలదు.

ఉత్తరంలో జై భారత్‌తో బిజెపి ఓట్లకు గండి

ఉత్తరం అసెంబ్లీ సెగ్మెంట్‌కు బిజెపి మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు బరిలో ఉన్నారు. వైసిపి అభ్యర్థిగా కెకె.రాజు పోటీ చేస్తున్నారు. నాలుగేళ్లుగా పలు కార్యక్రమాలతో కెకె.రాజు ప్రజానీకానికి దగ్గరయ్యారన్న చర్చ లేకపోలేదు. గత ఎన్నికల్లో విశాఖపట్నం ఎంపీగా బరిలోకి దిగిన సిబిఐ మాజీ జెడి వివి.లక్ష్మీనారాయణ ఈ దఫా ఉత్తరం ఎమ్మెల్యేగా తాను స్థాపించిన జై భారత్ నేషనల్ పార్టీ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

విఎంఆర్‌డిఎ భూమి ఆక్రమణ


పదెకరాలతో పాటు 210, 212, 218 ఇతర సర్వే నెంబర్లలోని 20.12 ఎకరాలను 2004 మార్చి 12న స్వర్ణాంధ్ర మ్యూచవల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి (ఆర్.నెం.872/03/ఎఫ్5) కేటాయిస్తూ వుడా ప్రొసిడింగ్స్ ఇచ్చింది. సర్వే నెంబర్ 224లో హౌసింగ్ సొసైటీకి ఇవ్వగా మిగిలిన 6.76 ఎకరాల భూమికి కంచె వేయకుండా వదిలేసింది. గాజువాక-యలమంచిలి రోడ్డుకు అనుకొనివున్న ఈ భూమిపై స్థానిక నాయకుల కళ్లు పడ్డాయి. ఈ భూమి రైతులదని చెప్పి స్థానిక స్థిరాస్తి వ్యాపారులు విఎంఆర్‌డిఎకు చెందిన 6.76 ఎకరాల భూమిని చదును చేయడం ఆరంభించారు. రెవెన్యూ, అటవీశాఖ అనుమతి తీసుకోకుండా గుట్టుచప్పుడు లేకుండా లక్షల విలువైన టేకుచెట్లను విక్రయించారు. విఎంఆర్‌డిఎ భూమిని ప్రయివేటు వ్యక్తులు ఆక్రమించి చదును చేస్తున్నారని తహశీల్దార్ గణపతిరావు పరవాడ పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. విఎంఆర్‌డిఎ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చదును చేసిన వారం రోజులకుగానీ విఎంఆర్‌డిఎ అధికారులు స్పందించకపోవడంతో విలువైన టేకు చెట్లు కొట్టేశారు. తీరిక చూసుకొని మార్చి 30న విఎంఆర్‌డిఎ అధికారులు విఎంఆర్‌డిఎకు చెందిన భూమిని గొర్లె కనకారావు, గొర్లె సన్యాసినాయుడు సహా పలువురు ఆక్రమించారని పరవాడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదే విషయం విఎంఆర్‌డిఎ తహశీల్దార్ వీరభద్రరావు వద్ద ప్రస్తావించగా తమకు చెందిన భూమిని ఆక్రమిస్తున్న గొర్లె కనకారావు, గొర్లె సన్యాసినాయుడుపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు 'ప్రజాశక్తి'కి తెలిపారు.

'కూటమి' ఇరకాటంలో పడుతోందా ?

తరుపున బరిలో ఉన్నాయి. వైసిపి వ్యతిరేక ఓట్లు బిజెపికి వెళ్లకుండా అడ్డుగోడలా జై భారత్ నేషనల్ పార్టీ ఇక్కడ ఉంటుందని పలువురు చెబుతున్నారు. గత ఎన్నికల్లో ఉత్తరం ఎంఎల్ఎ అభ్యర్థిగా జనసేన నుంచి పోటీచేసిన పసుపులేటి ఉషాకిరణ్ సుమారు 19 వేలు ఓట్లు తెచ్చుకున్నారు. బిజెపికన్నా అవి ఎక్కువ. ఈ దఫా కూటమి అభ్యర్థికి ఆమె మద్దతుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

తూర్పు, పశ్చిమల్లో..

తూర్పు సెగ్మెంట్‌లో గతంలో టిడిపి నాయకుడు వెలగపూడి రామకృష్ణబాబు రెండు సార్లు గెలిచేందుకు దోహదపడిన సినీ నిర్మాత, ఈ ప్రాంతంలో పట్టుగల వ్యక్తి కంచర్ల అచ్యుతరావు. ఇటీవలే టిడిపికి రాజీనామా సమర్పించారు. మూడు వేల మందితో వైసిపిలో చేరారు. 2009లో ప్రజారాజ్యం టికెట్ కోసం ప్రయత్నించినా ఆయనకు రాలేదు. ఆయన వైసిపితో వెళ్లడమూ కూటమికి ఇరకాటంగా మారింది. పశ్చిమ అసెంబ్లీలోనూ ఈ తరహా పరిణామాలే కూటమిని సవాల్ చేసేలా పరిణమించాయి. పశ్చిమం కేంద్ర ప్రభుత్వ రంగ పరిశ్రమలైన హెచ్‌పిసిఎల్, స్టీల్‌ప్లాంట్ కార్మికులు, రక్షణ రంగానికి చెందిన ఉద్యోగులు నివాసముండే ప్రాంతం. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేయాలని తరచూ చేస్తున్న ప్రయత్నాలను ఈ ప్రాంత కార్మికవర్గం తిప్పికొట్టడంలో కీలకపాత్రనే పోషిస్తోంది. ఈ నేపథ్యంలో ఇక్కడా కూటమికి గడ్డు పరిస్థితినే ఎదురవుతోంది.



రోడ్డు షో నిర్వహిస్తున్న ఝాన్సీ, వాసుపల్లి

34వ వార్డులో ఝాన్సీ, వాసుపల్లి ప్రచారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైసిపి విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ 34వ వార్డులో బుధవారం జోరుగా ప్రచారం నిర్వహించారు. 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగింది. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఇరువురూ రోడ్డు షో నిర్వహించారు. నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, దక్షిణ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు ద్రోణంరాజు శ్రీవాత్సవ్ ప్రచారంలో అగ్రభాగాన ఉన్నారు. 34వ వార్డులో అచ్చిమ్మపేట వద్ద రోడ్డు షో ప్రారంభమై డాల్ఫిన్ రోడ్డు మీదుగా 75 అడుగుల రోడ్డు వయా భూపేష్ నగర్ జెండా చెట్టు, లక్ష్మీదేవి పేట, నేతాజీ నగర్ ప్రాంతాల గుండా సాగింది. ఈ సందర్భంగా బొత్స ఝాన్సీ మాట్లాడుతూ తమను గెలిపిస్తే స్థానిక సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఎదురెదురుపడ్డ వాసుపల్లి, లక్ష్మీనారాయణ

దక్షిణ నియోజకవర్గం వైసిపి అభ్యర్థి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, ఉత్తర నియోజవర్గం జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి, ఆ పార్టీ అధ్యక్షులు వివి.లక్ష్మీనారాయణ బుధవారం ఒకే చోట ఎదురెదురు పడ్డారు. ఆసక్తికరమైన ఈ సంఘటన ఆశీలుమెట్టలోని శ్రీ సంపత్ వినాయక ఆలయం వద్ద జరిగింది. వీరిద్దరూ ఒకరికొకరు అభివాదం చేసుకున్నారు. రాజకీయ అంశాలపై కాసేపు ముచ్చటించుకున్నారు.

న్యూగో సేవలు విస్తరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : న్యూగో సేవలు దేశవ్యాప్తంగా విస్తరించినట్లు గ్రీన్ సెల్ మొబిలిటీ సిఇఒ దేవేంద్ర చావ్లా తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ పర్యావరణ అనుకూలమైన, సాంకేతికతతో నడిచే మొబిలిటీ పరిష్కారాలను అందించడం ద్వారా, సమాంతర ప్రయాణాన్ని మెరుగుపరచాలనేదే తమ లక్ష్యమన్నారు.

కెజిహెచ్ నర్సింగ్ కళాశాలలో..

ర్యాగింగ్‌పై సిఎంకు ఫిర్యాదు

- విచారణకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో నడుస్తున్న గవర్నమెంట్ నర్సింగ్ కళాశాలలో వికృతమైన ర్యాగింగ్, చట్ట విరుద్ధమైన అసాంఘిక కార్యకలాపాలు, అవినీతిపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థినులకు రక్షణ కల్పించాలని కోరుతూ ముఖ్యమంత్రికి ఫిర్యాదు అందింది. ఆ కళాశాలలో తృతీయ సంవత్సరం నర్సింగ్ చదువుతున్న భీమునిపట్నంకు చెందిన పైడిపల్లి సుజాత చేసిన ఈ ఫిర్యాదు బుధవారం కలకలం రేపింది. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున వెంటనే స్పందించి విద్యార్థిని ముఖ్యమంత్రికి రాసిన లేఖపై దర్యాప్తు జరిపి నివేదిక ఇవ్వాలని ఆర్‌డిఒ, కెజిహెచ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్, ఇక్కడి సిబ్బంది, ట్యూటర్స్ విద్యార్థినులను పలు విధాలుగా వేధిస్తున్నారని, వీరి వేధింపులు భరించలేక మధ్యలోనే కాలేజీ విడిచి పెట్టాలని పలుమార్లు భావించానని, అయితే తనపై ఎన్నో ఆశలు పెట్టుకొని తన తల్లిదండ్రులు ఇక్కడ చదివిస్తున్నారని, తమది నిరుపేద కుటుంబమని, వారిని బాధించడం ఇష్టం లేక భరిస్తున్నానని ఆ లేఖలో బాధితురాలు పేర్కొంది.

నిరాధారమైన ఫిర్యాదు
: ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సత్యవల్లి

నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సత్యవల్లి మీడియాకు వివరణ ఇస్తూ.. ఎంతో చరిత్ర కలిగిన ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో ర్యాగింగ్ జరిగిందనడం సరికాదని, అందుకు ప్రిన్సిపాల్, సిబ్బంది బాధ్యులని విద్యార్థిని ఆరోపించడం తగదని అన్నారు. కాలేజీలో ఎటువంటి ర్యాగింగ్‌గూ జరగలేదన్నారు. ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా ఒక కమిటీని, స్క్వాడ్‌ను ఏర్పాటు చేశామన్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటిని చాలా కాలం నుంచి నడుపుతున్నట్లు తెలిపారు. హాస్టల్ నిర్వహణ స్టూడెంట్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. విద్యార్థిని ఫిర్యాదు పూర్తిగా నిరాధారమైందని ఆమె ఖండించారు. తాను ఇదే కాలేజీలో నర్సింగ్ చదువుకొని ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నానని చెప్పారు. సిబ్బంది కూడా ఇదే కాలేజీలో చదువుకొని ఇక్కడే ఉద్యోగాలు చేస్తున్నారని వివరణ ఇచ్చారు.

నడకతో ఆరోగ్యం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నడకతో ఆరోగ్యంగా ఉండొచ్చని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు, తూర్పు నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి.సత్యనారాయణ అన్నారు. స్థానిక తెన్నేటి వాకర్స్ పార్కు, వైఎస్ఆర్ వ్యూ పాయింట్ పార్కు, రోప్ వే వాకర్స్ పార్కులలో ఆయన బుధవారం పర్యటించారు. వాకర్స్‌ను, సీనియర్ సిటిజన్స్‌ను కలిశారు. వారిని పలకరిస్తూ కాసేపు మార్నింగ్ వాక్ చేశారు. ఓట్లు అభ్యర్థించారు. ఇప్పటికే విశాఖ తూర్పు నియోజకవర్గంలో శివాజీపాలెం, అప్పుఘర్, బీచ్ రోడ్డు తదితర ప్రాంతాల్లో వాకర్స్‌కు మార్నింగ్ వర్క్ చేసుకునే విధంగా వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేశామన్నారు. తాను గెలిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.



వాకర్స్‌తో ముచ్చటిస్తున్న ఎంవివి.సత్యనారాయణ

ప్లాటినం జ్యూయలరీ నుంచి విభిన్న ఆభరణాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్లాటినం జ్యూయలరీ విభిన్న ఆభరణాలు ముందుకు తెచ్చిందని, ఉగాది పండగను వాటితో వైభవంగా చేసుకోవాలని ప్లాటినం గిల్డ్ ఇంటర్నేషనల్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ వైశాలి బెనర్జీ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం బీచ్ రోడ్డులోని నోవాటెల్ హోటల్‌లో ప్లాటినమ్ జ్యూయటరీ ఉత్తరాంధ్ర రిటైల్ భాగస్వాముల సదస్సు నిర్వహించారు.

అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 95 శాతం స్వచ్ఛతతో ప్లాటినం ఆభరణాలు తమ సొంతమన్నారు. ఉగాది పండగ సమయంలో ఆభరణాలను కొనుగోలు చేయాలనుకునే వారికి లేదా బహుమతిగా ఇవ్వాలనుకునే వారికి తమ ఆభరణాలు ఉత్తమ ఎంపిక అని చెప్పుకొచ్చారు.

కార్యక్రమంలో జిఆర్‌టి జ్యూయలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ జిఆర్.ఆనంద్ అనంత పద్మనాభన్, కళ్యాణ్ జ్యూయలర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేష్ కళ్యాణరామన్, తదితరులు పాల్గొన్నారు.

32వ వార్డులో వంశీకృష్ణ ప్రచారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గం జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ బుధవారం ఉదయం 32వ వార్డులోనూ, సాయంత్రం జగదాంబ కూడలి లేపాక్షి దగ్గర నుండి ప్రచారం నిర్వహించారు. అందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్, కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, 30 వార్డు జనసేన అధ్యక్షులు యజ్ఞశ్రీ ,టిడిపి వార్డు అధ్యక్షులు డోక్ర రమణ బిజెపి వార్డు అధ్యక్షులు అబ్బు, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త శివప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

కోల్‌కతా పరుగుల వరద

ప్రజాశక్తి - పిఎం.పాలెం : విశాఖ వేదికగా పిఎం.పాలెం ఎసిఎ విడిసిఎ క్రికెట్ స్టేడియంలో బుధవారం ఐపిఎల్ మ్యాచ్ కోలాహలంగా సాగింది. వేలాది మంది క్రికెట్ అభిమానులతో స్టేడియం పరిసర ప్రాంతాలు కిక్కిరిసాయి. ఈ మ్యాచ్‌లో కొల్‌కతా పరుగుల వరద పారించి విజయం సాధించింది. మొన్న జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్ విజయకేతనం ఎగురవేయడంతో మళ్ళీ ఆ జట్టే గెలుస్తుందని ఎక్కువ మంది ఆశాభావం వ్యక్తం చేశారు.



కానీ బుధవారం సాయంత్రం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై కొల్‌కతా సంపూర్ణ ఆధిపత్యం కనబరిచింది. కొల్‌కతా బ్యాట్స్‌మ్యాన్లు సిక్సర్లు, ఫోర్లుతో అలరించారు. తొలుత ఆ జట్టు 20 ఓవర్లలో 272 భారీ స్కోరు సాధించి 7 వికెట్లు నష్టపోయింది. నరైన్ 89 పరుగులతో, రాఘవ 51 పరుగులతో రాణించారు. తరువాత బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ జట్టు 17 ఓవర్లలో 166 పరుగులకే ఆలౌటైంది.

రూపశ్రీ మృతి కేసులో న్యాయం జరిగేలా చూస్తాం

ఎపి ఉమెన్ కమిషన్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మి



మాట్లాడుతున్న ఎపి ఉమెన్ కమిషన్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మి

ప్రజాశక్తి- పిఎం పాలెం : రూపశ్రీ మృతి పట్ల న్యాయం జరిగేలా చూస్తామని ఏపీ స్టేట్ ఉమెన్ కమిషన్ చైర్‌పర్సన్ గజ్జెల వెంకటలక్ష్మి చెప్పారు. కొమ్మాది సమీపంలోని చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఇటీవల భవనంపై నుంచి పడి మృతి చెందిన డిప్లమో మొదటి సంవత్సరం విద్యార్థిని రూపశ్రీ కుటుంబ సభ్యులు బుధవారం కళాశాల ఎదుట న్యాయం చేయాలని ఆందోళన చేశారు. ఈ కేసులో ఇప్పటికే నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మృతికి సంబంధించి విచారణ నిమిత్తం మహిళా, చైల్డ్, ఆంధ్రా కళాశాల న్యాయ విభాగం మొత్తం మూడు బృందాలు కమిటీగా ఏర్పడి బుధవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ, రూపశ్రీ ఆత్మహత్య వార్త చూసి చలించిపోయామన్నారు. దాని వెనుక కారణాలు మరింత చలించవేసిందన్నారు. క్రమశిక్షణ నేర్పించాల్సిన ఫ్యాకల్టీ న్యూడ్ వీడియోస్ తీసి బెదిరించడం సిగ్గుచేటన్నారు. రూపశ్రీ మరణం ద్వారా అయినా సరే మిగతా విద్యార్థులకు న్యాయం జరుగుతుందని లెటర్ రాయడం ఇక్కడి విద్యార్థులు ఎటువంటి పరిస్థితుల్లో ఉన్నారో అర్థం చేసుకోవచ్చని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన రూపశ్రీ మంచి ర్యాంకు సాధించి ఇక్కడకు వచ్చిందని, కానీ కామాంధులు ఈ భూమి మీద లేకుండా చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కాలేజీలో విద్యాసంస్థలకు ఉండాల్సిన కనీసం సౌకర్యాలు లేవన్నారు. ఎక్కడా సీసీ కెమెరాలు కూడా లేవని, ఐసిపి కమిటీ అనుమతి లేదని, ఎక్కడా కూడా కంప్లైంట్ బాక్స్ కూడా లేదని తెలిపారు. హాస్టల్ వెనుక అంతా అపరిశుభ్రంగా ఉందని, కొంతమందికి సరైన భోజన సదుపాయాలు కూడా లేవని తెలిపారు. ఇలాంటి కళాశాలల గుర్తింపు తొలగించాలన్నారు. ఇక్కడి విద్యాసంస్థలు ముసుగులో దోపిడీ జరుగుతుందని అభిప్రాయపడ్డారు. బాత్రూమ్‌లో డోర్స్ కూడా లేని పరిస్థితి నెలకొనడం బాధాకరమని పేర్కొన్నారు.

రూపశ్రీ మెరిట్ కాకపోతే ఇక్కడ సీటు ఎలా వచ్చిందని ప్రశ్నించారు. అడ పిల్లల హాస్టల్ వద్ద వార్డెన్ తన భర్తతో ఎలా నివసిస్తుందని ప్రశ్నించారు. ఇలాంటి కళాశాలను మూయించే విధంగా చర్యలు తీసుకోవాలనీ కోరారు. ఇక్కడ చాలా తప్పులు జరుగుతున్నాయన్నారు. సీపీ కూడా తమకు కొన్ని సమస్యలు చెప్పారని, వాటిని కూడా నమోదు చేసుకున్నట్లు తెలిపారు. తాము విచారణ చేసి కలెక్టర్‌కు నివేదిస్తామని చెప్పారు. ఈ కేసులో ఇప్పటి వరకు ఐదుగురిని అరెస్ట్ చేశారని, ఎంతమంది ఉన్నా చర్యలు తప్పవని స్పష్టంచేశారు.

నాలుగు అంతస్తులపై నుంచి పడి చనిపోయిందని చెబుతున్నా నమ్మశక్యంగా లేదన్నారు. అమ్మాయి ఉదయం నుంచి కనపడకపోతే పోలీస్ స్టేషన్‌కు ఎందుకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించారు. అమ్మాయి ఫోన్‌లో కొన్ని మెసేజ్‌లు డిలీట్ కూడా చేశారని తెలిపారు. కెమిస్ట్రీ ల్యాబ్ టెక్నీషియన్ అసభ్యకరంగా విద్యార్థినులను తాకేవాడని కూడా ఒక విద్యార్థి చెప్పినట్లు తెలిపారు. దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని విద్యార్థినులకు చెప్పారు.



నిరసన తెలుపుతున్న రూపశ్రీ కుటుంబీకులు

నేరాలు ఘోరాలు

వివాహిత అదృశ్యం

ప్రజాశక్తి -మధురవాడ : పోతినమల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో వివాహిత అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. సిఐ వై.రామకృష్ణ కథనం ప్రకారం... పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన బాపన్ మండలం, అతని భార్య తుంప మండలం 8 ఏళ్ల కుమార్తెతో కలిసి మారికవలస పిపిటి కాలనీలో నివాసముంటున్నారు. బాపన్ మండలం పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత నెల 29వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన తుంప మండలం తిరిగి ఇంటికి రాలేదు. దాంతో ఆమె భర్త చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో, బంధువులు ఇళ్లల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో పిఎం.పాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం లోడగలవానిపాలెం పంచాయతీ, శ్రమజీవులు కాలనీలో బుధవారం మహిళ అనారోగ్యంతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. శ్రమజీవుల కాలనీలో కొత్తవలస రాంబాబు, ఆయన భార్య లక్ష్మీతులసి (40), కుమార్తెలు శిరీష (23) లావణ్య (20) ఉంటున్నారు. లక్ష్మీతులసి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. అనారోగ్యాన్ని తట్టుకోలేక బుధవారం ఇంట్లో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులకు కుటుంబీకులు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సిఐ తిరుపతిరావు ఆధ్వర్యాన ఎస్ఐ గంట్యాడ సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎఆర్‌సికి ఎలుగుబంటి తరలింపు

ప్రజాశక్తి - ఆరిలోవ : శ్రీకాకుళం జిల్లా వజ్రపు కొత్తూరు మండలం, మెట్టూరు గ్రామంలో ఒక పాడుబడిన ఇంట్లో దాక్కున్న ఒక ఎలుగుబంటిని శ్రీకాకుళం అటవీ డివిజన్ అధికారుల సమన్వయంతో మంగళవారం సాయంత్రం విశాఖలోని జూ పార్కుకు సురక్షితంగా తరలించారు. ఎలుగుబంటికి జూ వైద్యుడు ప్రాథమిక పరీక్షలు నిర్వహించగా శరీరంపై కొన్ని గాయాలైనట్టు గుర్తించారు. ప్రాథమిక చికిత్స అందించి జంతు సంరక్షణా కేంద్రానికి తరలించినట్టు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా తెలిపారు.

'సంక్షేమ పథకాలే విజయానికి దోహదం'

ప్రజాశక్తి -భీమునిపట్నం : వైసిపి ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలే విజయానికి దోహదపడతాయని వైసిపి మండల అధ్యక్షులు గాడు శ్రీను పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఎంపిపి దంతులూరి వాసురాజు, వైస్ ఎంపిపి బోని బంగారునాయుడు, ఎఎంసి చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ తదితరులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కులమతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా జగన్మోహన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసినట్లు చెప్పారు. గత ఎన్నికల్లో వైసిపికి మండలంలో వచ్చిన మెజారిటీ కంటే ఈ దఫా రెట్టింపు మెజారిటీ వస్తుందని జోస్యం చెప్పారు. నిత్యం ప్రజల్లో ఉన్న ముత్తంశెట్టి శ్రీనివాసరావునే ప్రజలు ఆదరిస్తారన్నారు. ఇటీవల కొద్దిమంది పార్టీని వీడినప్పటికి వచ్చిన నష్టం ఏమీ లేదన్నారు. ఈ సమావేశంలో దాకమర్రి ఎంపిటిసి సభ్యులు చెల్లూరి నగేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రహదారి పక్కనే డంపింగ్


పద్మనాభంలో మార్కెట్ యార్డ్ ప్రహరీ పక్కనే డంప్ చేస్తున్న వ్యర్థాలు

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం మండల కాంప్లెక్స్‌కు సమీపంలో కృష్ణాపురం సర్వేనెంబర్ 1లో పద్మనాభం జంక్షన్ నుంచి తగరపువలస వెళ్లే రహదారిలో భీమిలి మార్కెట్ యార్డు ప్రహరీ పక్కన వ్యర్థాలను డంపింగ్ చేస్తున్నారు. కష్ణాపురం పంచాయతీ పరిధిలో ఉన్న దళితవాడ, బీసీ కాలనీలకు సంబంధించిన చెత్త, మురుగు కాలువల వ్యర్థాలను రోడ్డు పక్కనే వేయుటంతో సమీపంలోని నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ వ్యర్థాలు వల్ల దుర్వాసన వెదజల్లుతోందని, ఈగలు, దోమలు ప్రబలుతున్నాయని స్థానిక కాలనీవాసులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మండల, జిల్లా స్థాయి అధికారులు అదే మార్గంలో ప్రయాణిస్తున్నా పట్టనట్లు ఉంటున్నారని ఆరోపిస్తున్నారు. ఈ సమస్యపై అధికారులకు గ్రామానికి చెందిన సరాల సన్యాసినాయుడు పలుమార్లు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయినా స్పందన లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి పన్నులు కట్టించుకోవడంలో తీసుకున్న శ్రద్ధ పారిశుధ్య నిర్వహణపై లేదని స్థానికులు మండిపడుతున్నారు.

44వ వార్డులో వైసిపి ఎన్నికల కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 44వ వార్డు పరిధి అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డులో కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన వార్డు ఎన్నికల కార్యాలయాన్ని ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు బుధవారం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తోక పార్టీలన్నీ ఉమ్మడిగా పోటీ చేస్తే వైసిపి సింగిల్‌గా ఈ ఎన్నికల్లో పోటీ చేస్తోందని తెలిపారు. ప్రజలే తన కుటుంబ సభ్యులుగా భావించి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. విద్య, వైద్యానికి పెద్దపీట వేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, నాయకులు బాణాల తరుణ్, 44వ వార్డు సీనియర్ నాయకులు మహిళలు పాల్గొన్నారు.


ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కెకె.రాజు తదితరులు

స్నిపర్ పార్కులో ప్రచారం

ఎన్నికల ప్రచారంలో భాగంగా 14వ వార్డు పరిధి సీతమ్మధారలోని స్నిపర్ పార్కును కెకె రాజు బుధవారం సందర్శించారు. పార్కులో వాకర్స్‌తో కొంతసేపు ముచ్చటించారు. రానున్న ఎన్నికల్లో తనకు మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో హరివర్మ, అసోసియేషన్ పెద్దలు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు

3వ వార్డులో ముత్తంశెట్టి ప్రచారం

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు పరిధి చిన్న బజారు, మార్కెట్ తదితర ప్రాంతాల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తు ఉన్న కరపత్రాలను అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, విశాఖ ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అల్లిపిల్లి నరసింగరావు, కె.ఎల్లాజి, జి.మధునాయుడు, గౌరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సొంట్యాం, గండిగుండంలో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం సొంట్యాం, గండిగుండం గ్రామాలలో బుధవారం వైసిపి పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీ, శాసనసభ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గత నాలుగున్నర ఏళ్లుగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా బొత్స ఝాన్సీని, ముత్తంశెట్టి శ్రీనివాసరావును, ఎమ్మెల్సీ వరుదు కల్యాణిని గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సొంట్యాం సర్పంచ్ లంక లావణ్య, రాంబాబు, గండిగుండం సర్పంచ్ జి.శ్రీను, పార్టీ మండల అధ్యక్షులు బంక సత్యం, జడ్‌పిటిసి సభ్యులు కోరాడ వెంకటరావు, ఎంపిపి మజ్జి శారదా ప్రియాంక, మజ్జి వెంకట్రావు, వైస్ ఎంపిపి పాండ్రంకి శ్రీను పాల్గొన్నారు.

బిఎస్‌పి అభ్యర్థి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి -భీమునిపట్నం : బిఎస్‌పి స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి భాగం గోపాలరావు బుధవారం జివిఎంసి నాలుగో వార్డు పరిధి నిడిగట్టులో ఉన్న దళితవాడలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మే 13న జరుగు ఎన్నికల్లో భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, విశాఖ లోక్‌సభ అభ్యర్థిగా శివప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత మహిళలు, యువకులు పాల్గొన్నారు.

గాజువాక సమస్యల పరిష్కారానికి కృషి : అమర్‌నాథ్

ప్రజాశక్తి- గాజువాక : గాజువాక నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ హామీ ఇచ్చారు. జివిఎంసి 73వ వార్డు పరిధి సమతానగర్‌లో కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, శ్రీనివాస్ నేతృత్వంలో వైసిపి శ్రేణుల సమావేశం బుధవారం తన చిన్నతనం నుంచి గాజువాక ప్రజలతో కలిసిమెలిసి తిరిగానని, ఈ ప్రాంతంపై పూర్తి అవగాహన ఉందని, తనను గెలిపిస్తే గాజువాకలోని సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో ఈ ఐదేళ్లలో దాదాపు రూ.2000 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. గాజువాకలోని పలు కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించి నాగిరెడ్డి ప్రజలకు ఎంతో మేలు చేశారని చెప్పారు. తన తండ్రి గురునాథరావు ఈ ప్రాంతానికి ఎమ్మెల్యేగా పనిచేసినప్పుడు కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకున్నారన్నారు. గుడివాడ వారసుడిగా, మీ కుటుంబాల్లో ఒక సభ్యునిగా భావించి ఈ ఎన్నికల్లో తనకు, పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝూన్సీకి ఓటు వేయాలని అమర్‌నాథ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పల్లా చినతల్లి, రాజన వెంకటరావు, కులుకూరు మంగరాజు, మొల్లి చిన్న, మొహమ్మద్ గౌస్, షౌకత్ అలీ, ఆళ్ల శివ గణేష్, ఈగలపాటి యువశ్రీ, గొందేసి రమణారెడ్డి, కంది పైడినాయుడు, కరణం వేణుగోపాల్, వి.రామకృష్ణరాజు, గొరుసు సత్యంరెడ్డి, బొట్ట సత్తిబాబు, ప్రభ, కె.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కీర్తి పట్నాయక్

ఘనంగా 'శ్రీదేవి విజ్ఞాన జ్యోతి' వార్షికోత్సవం

ప్రజాశక్తి -మాధవధార : శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్టు 22వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీనగర్‌లోని శ్రీదేవి పార్కులో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, పేదలు, నిరాశ్రయులు 120 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్టు నిర్వాహకులు కీర్తి పట్నాయక్ మాట్లాడుతూ, గత 22 ఏళ్ల నుంచి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

పినమడకలో ఉచిత నేత్ర వైద్యశిబిరం

ప్రజాశక్తి- గాజువాక : జివిఎంసి 85వ వార్డు పరిధి అగనంపూడి పినమడకలో శ్రీ సత్య సాయి క్లినిక్, విజన్ కేర్ నేత్ర ఆర్గనైజేషన్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఎడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద ప్రజలకు ఉచిత నేత్ర పరీక్షలు చేయడం పట్ల అభినందించారు. విజన్‌కేర్ నేత్ర వైద్యులు కె.శివకుమార్ మాట్లాడుతూ, కళ్లు మసగ్గా కనబడితే అశ్రద్ధ చేయకుండా వెంటనే నేత్ర వైద్యులను సంప్రదించాలని సూచించారు. అగనంపూడి జనరల్ ఆస్పత్రిలో ఉన్న కేర్ విజన్ ఆధ్వర్యాన ఇప్పటికి 9 ఉచిత నేత్ర వైద్య శిబిరాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. విశాఖ లయన్స్ క్లబ్ చైర్మన్ కడిమి హనుమంతరావు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ రామారావు, డాక్టర్ కెజె.నాయుడు, టిడిపి నాయకులు గొల్లవిల్లి నూకరాజు, అండిబోయిన మంగరాజు, జనసేన నాయకులు అట్ట అప్పారావు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఎం.జగదీష్, ఐ.రామ్‌గోపాల్, ఎవి.రామకృష్ణ, జి.గోవిందరావు, విజన్ కేర్ ప్రతినిధి కె.సుధారాణి తదితరులు పాల్గొన్నారు. శిబిరాన్ని ఏర్పాటు చేసినందుకు సత్యసాయి క్లినిక్ అధినేత వివి రామారావును సన్మానించారు.


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

టిడిపి కూటమి, వైసిపి అభ్యర్థులను ఓడించాలి

విదసం

ప్రజాశక్తి-సీతమ్మధార : కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తాం అని బహిరంగ ప్రకటన చేస్తున్న బిజెపిని, రాష్ట్రంలో ఆ పార్టీతో అలయెన్స్‌లో ఉన్న టిడిపి, జనసేనను, డెడ్ బాడీలను డోర్ డెలివరీ చేసి, సంక్షేమ పథకాలకు సమాధి కట్టిన వైసిపిని ఓడించాలని విదసం ఐక్య వేదిక కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు పిలుపునిచ్చారు. అంబేద్కర్ భవన్ వద్ద పత్రికా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి భారత రాజ్యాంగానికి అడుడగునా తూట్లు పొడుస్తోందన్నారు. 400 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్నే మార్చేస్తాం అనడం దేశానికి ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో ఆదివాసీలపై మత విద్వేషంతో మారణ హోమం సృష్టించి వందల మంది మాన ప్రాణాలను బలి తీసుకోవడంతోపాటు దేశంలో ఆదివాసీలు, దళితులు, క్రైస్తవ ముస్లిం మైనార్టీలకు రక్షణ లేదన్నారు. రాజ్యాంగ పీఠికలో లౌకికవాదం అనే పదాన్ని తొలగించి మనువాద దృక్పథంతో భారత దేశాన్ని మత రాజ్యంగా మార్చే కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. బిజెపి చేతిలోంచి దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకునే అవసరం ఉందని, దానికోసం కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమిని గెలిపించాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. కాంగ్రెస్ కూటమిలో బిఎస్‌పి, ఇతర నీలి పార్టీలను కలిపి విశాల ప్రజాస్వామిక వేదిక నిర్మించాలన్నారు.

వేదిక సలహాదారు ఎస్ఆర్.వేమన మాట్లాడుతూ, ఎస్‌సి, ఎస్‌టి కార్పొరేషన్లకు తాళాలు వేసి సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించి 20కి పైగా సంక్షేమ పథకాలను సమాధి చేసిన వైసిపికి దళితులను ఓటడిగే నైతిక హక్కు లేదన్నారు. కోడి కత్తి శీను బెయిల్, రద్దయిన పథకాల సాధన కోసం క్షేత్ర స్థాయి నుంచి అమరావతి వరకూ విదసం సమరశీల పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. ఈ రాష్ట్రంలో తామే ప్రత్యామ్నాయం అన్న టిడిపి, జనసేన కూటమి బిజెపితో జట్టుకట్టి దళితులను, లౌకికవాదులను దూరం చేసుకుందన్నారు. సహాయ కన్వీనర్ సోడదాసి సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బల్ల కుమార్, జాజి ఓంకార్, బోడపాటి శామ్యూల్ కుమార్, బూల భాస్కరరావు, గుడాల ఈశ్వరరావు, పి.శ్రీనివాస్, మందా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న విదసం నాయకులు

రామకృష్ణాపురంలో వైసిపి ప్రచారం


ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న రమాకుమారి

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 61వ వార్డు పరిధి రామకృష్ణాపురంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌కు మద్దతుగా బుధవారం ప్రచారం నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ, వార్డు వైసిపి అధ్యక్షుడు వాసు ఆధ్వర్యాన ఎలమంచిలి మున్సిపల్ చైర్మన్ పి.రమాకుమారి ఇంటింటికీ వెళ్లి ఆనంద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ఆనంద్‌కుమార్‌ను ఎందుకు గెలిపించుకోవాలో చెబుతూ కరపత్రాలను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, ఇన్‌ఛార్జులు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు కృషి

తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే పారిశ్రామిక ప్రాంతంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు కృషిచేస్తానని రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ ప్రతినిధుల సమావేశంలో పశ్చిమ నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ హామీ ఇచ్చారు. కొత్తనక్కవానిపాలెంలోని వైసిపి నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ రవిరాజు ఆధ్వర్యాన బాక్సర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార మాట్లాడుతూ, ప్రతిభ కలిగి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి ఇబ్బందులు పడే క్రీడాకారులకు తన వంతుగా ఏ సహాయం కావాలన్నా అందిస్తానని భరోసా ఇచ్చారు. జగన్మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేసుకుంటే అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందుతారన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆశయ సాధన దిశగానే తాను కూడా నియోజకవర్గంలో యువత అభివృద్ధికి జాబ్ మేళా, ఉచిత ఆన్‌లైన్ స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు, క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ వైసిపి పరిశీలకులు ఎస్ఎ రెహమాన్, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, కార్పొరేటర్ పివి సురేష్, బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు, బాక్సింగ్ కోచ్‌లు, క్రీడాకారులు, స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీ చైతన్యలో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి -పిఎం.పాలెం : మధురవాడ బక్కన్నపాలెం రోడ్డులో ఉన్న శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే ను ఘనంగా నిర్వహించారు. ఐదవ తరగతి నుంచి ఆరవ తరగతిలోనికి ప్రవేశించే విద్యార్థులు ఈ గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్నారు. ఐదో తరగతిలో అత్యుత్తమ ప్రదర్శనను కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, మెడల్స్ అందించారు. ప్రాథమిక విద్యను పూర్తి చేసుకొని మాధ్యమిక విద్యలోకి ప్రవేశిస్తున్న విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపల్ సందీప్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. చివరగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఉత్తరాంధ్ర, కాకినాడ జోన్ శ్రీ చైతన్య పాఠశాలల ఎజిఎం సురేష్, శ్రీ చైతన్య పాఠశాలల రీజినల్ ఇన్చార్జ్ అహ్మద్ ఆలీ, వైస్ ప్రిన్సిపల్ ఉమామహేశ్వరరావు, ప్రైమరీ ఇన్చార్జ్ దుర్గ, ప్రైమరీ టీచర్లు పాల్గొని విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

ఇంటి వద్దే పింఛన్లు అందజేయాలి

ఎమ్మెల్యే వెలగపూడి

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆరిలోవ : వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు ఇచ్చే సామాజిక ఫించన్లు ఎప్పటిలాగానే ఇంటింటికీ వెళ్లి అందజేయాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు డిమాండ్ చేశారు. ఫించన్లు సచివాలయాల వద్ద ఇస్తున్నారన్న సమాచారంతో వెలగపూడి రామకృష్ణబాబు టిడిపి నాయకులతో కలిసి బుధవారం ఆరిలోవ కాలనీ చివరి బస్టాపు వద్ద ఉన్న ఆరవ నెంబరు సచివాలయాన్ని సందర్శించారు. ఇంకా ఫించన్లు ఇవ్వకపోవడంపై సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దకే వెళ్లి ఫించన్లు పంపిణీ చేయాలన్న స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఫించన్‌దారులకు ఎండ దెబ్బ తగిలే ప్రమాదముందని, వారికి మంచినీటి సౌకర్యం, షామియాన్లు ఏర్పాటు చేయాలని కొంతసేపు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేకనే ఫించన్లు ఇచ్చేందుకు కొత్తనాటకం తెరలేపిందని ఆరోపించారు. ఈ నెపం చంద్రబాబు మీద పెట్టి విష ప్రచారం చేస్తున్నారన్నారు. ఇలాంటి తప్పుడు ప్రచారాన్ని లబ్దిదారులు గమనించాలన్నారు. ఈ నిరసనలో టిడిపి నాయకులు ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, ముగడ రాజారావు, యల్లమిల్లి సురేష్, బాలస్వామి, సుధాకర్, మద్దిల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని 22 పంచాయతీల్లో 16 గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న సచివాలయ సిబ్బంది ద్వారా ప్రతి గ్రామంలోనూ సామాజిక పింఛన్లు పంపిణీ చేయాలని ఎంపిడిఒ బి.శైలజకు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కోరాడ రమణ ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కె.దామోదరరావు, ఎం.నందీశ్వరరావు, కె.సత్యనారాయణ, కె.లీలావతి, కె.నగేష్, పావని తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : ఇంటింటికీ వెళ్లి పింఛన్లు ఇవ్వాలని సిపిఐ ఏరియా సమితి కార్యదర్శి కానూరు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ ఏరియా సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సచివాలయాల వద్ద పింఛనుదారులకు తాగునీటి సదుపాయం కల్పించాలని, అవసరమైన చోట షామియానాలు వెయ్యాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు అల్లు బాబూరావు, ఎం అప్పలరాజు, ఎం.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.


సచివాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

పారదర్శకంగా ఎన్నికల ముందస్తు ప్రక్రియ

జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి

ప్రజాశక్తి- అనకాపల్లి

ఓట్ల నమోదు, మార్పులు, చేర్పులు తొలగింపులతో సహా ఎన్నికల ముందస్తు ప్రక్రియ పూర్తి పారదర్శకంగా చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి తెలిపారు. బుధవారం కలెక్టరు కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే వారం ఎన్నికల సిబ్బంది మొదటి రాండమైజేషన్ చేస్తున్నట్లు తెలిపారు. వేయి ఓటర్ల లోపు ఉన్న పోలింగ్ కేంద్రానికి ఒక పిఒ, నలుగురు ఒపిఒలు, వెయ్యికి మించితే పిఒ, ఐదుగురు ఒపివోలు వుంటారని చెప్పారు. జిల్లా కేంద్రంలో ఓట్ల లెక్కింపునకు ప్రతి కేంద్రంలో 14 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాకు సంబంధించిన 6 అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు, పార్లమెంటుకు సంబంధించిన 7 (పెందుర్తితో కలిపి) నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు అనకాపల్లిలోనే జరుగుతుందని వివరించారు. సి-విజిల్, ఆర్వోలకు వచ్చిన ఫిర్యాదులు, దినపత్రికలలో వచ్చిన ప్రతికూల వార్తలకు సంబంధించి ఫిర్యాదులను వెంటనే పరిశీలించి తగిన చర్యలు చేపడుతున్నామన్నారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల ననుసరించి జిల్లాలో పించన్ల పంపిణీ జరుగుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు బొలిశెట్టి శ్రీనివాసరావు (టిడిపి), ఐ.ఆర్.గంగాధర్ (కాంగ్రెస్), రుత్తల శంకరరావు (సిపిఐయం), కొణతాల హరనాథబాబు (ఆమ్‌ఆద్మీ), పి.నాగేశ్వరరావు(బిజెపి), కమాండ్ కంట్రోల్ రూమ్ ఇన్ఛార్జి పి.ప్రసాదు, ఆడిట్ఆఫీసర్ గోవిందరాజులు, పశుసంవర్ధకశాఖ ఎడి ప్రసాదరావు, పోస్టల్ బ్యాలట్ నోడల్ అధికారి కె.ఎస్.కుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు డి.రామ్మూర్తి, డిటి రవికుమార్, ఎస్.ఏ. తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు



హాట్ బాక్స్‌లు పంపిణీ చేస్తున్న ఎంఇఒ జయలక్ష్మి తదితరులు

ఆటిజం విద్యార్థులకు భరోసా కల్పించాలి

ప్రజాశక్తి-చోడవరం

ఆటిజం వైకల్యం కలిగిన వికలాంగ విద్యార్థులకు మేమున్నామన్న భరోసాను ప్రతి ఒక్కరూ కలిగించాలని చోడవరం మండల విద్యాశాఖాధికారి ఎం.జయలక్ష్మి అన్నారు. జిల్లా సహిత విద్యా సమన్వయకర్త శకుంతల సమకూర్చిన హాట్ టిఫిన్ బాక్స్‌లను వికలాంగ విద్యార్థులకు బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఎంఇఒ జయలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం జన్మిస్తున్న పిల్లల్లో ప్రతి100 మందిలో ఒకరికి ఆటిజం వచ్చే అవకాశం ఉందన్నారు. బాలికలతో పోల్చుకుంటే బాలురులో నాలుగు రెట్లు ఎక్కువగా రావడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆటిజం రావడానికి జన్యుపరమైన కారణాలతో పాటుగా సామాజిక, పర్యావరణ కారణాలు కూడా ఉన్నాయని తెలిపారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఆటిజం కలిగిన పిల్లలు మానసిక స్థైర్యాన్ని కోల్పోకుండా వారి తల్లిదండ్రులు అండగా ఉండాలన్నారు. జీవన శైలిని మార్చుకొని పిల్లలకు ఉద్వేగ భద్రత కల్పించాలని, ప్రత్యేక ఉపాధ్యాయుల సలహా, సహకారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడు మండలాలకు చెందిన ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, జగన్నాధనాయుడు, సత్యనారాయణ, రమేష్, పరదేశి, శ్రీదేవి, సరస్వతి, వికలాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



గేదెల సత్యనారాయణకు టిడిపి కండువా వేస్తున్న రాజు

టిడిపిలో చేరిన విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల

ప్రజాశక్తి -చోడవరం

మండలంలోని వైసిపికి చెందిన విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ ఆధ్వర్యంలో మండలానికి చెందిన పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, పాల సంఘం అధ్యక్షులు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరికి టిడిపి అభ్యర్థి కెఎస్ఎన్ఎస్.రాజు పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. గతంలో టిడిపిలో ఉన్న గేదెల సత్యనారాయణ, 2019 ఎన్నికల తరువాత రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం రావడంతో నాడు విశాఖ డెయిరీ వైస్ ఛైర్మన్‌గా ఉన్న (ప్రస్తుత ఛైర్మన్) ఆడారి ఆనంద్‌తో కలిసి గేదెల సత్యనారాయణ వైసిపిలో చేరారు. వైసిపిలో తమకు సముచిత స్థానం కల్పించలేదని కొంతకాలంగా స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీపై తీవ్ర విమర్శలు చేస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో గేదెల సత్యనారాయణ బుధవారం టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జి మల్లు నాయుడు, మజ్జి గౌరీ శంకర్, గోకివాడ కోటేశ్వరరావు, బియ్యపు అప్పారావు, ఎంవివి సత్యనారాయణ, దొంకిని అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దుర్మార్గ పాలనకు చరమగీతం పాడాలి



మాట్లాడుతున్న టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి -అచ్యుతాపురం

ప్రజలను పట్టి పీడిస్తున్న రాష్ట్రంలో దుర్మార్గపు పరిపాలనకు రానున్న ఎన్నికల్లో చరమగీతం పాడాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. అచ్యుతాపురం లేపాక్షి ఎంపోరియంలో బుధవారం జరిగిన టిడిపి, బిజెపి, జనసేన పార్టీల కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో అయ్యన్న ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జగన్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశాడని, మంచి చెడ్డా ఆలోచించే జ్ఞానం ముఖ్యమంత్రికి లేదని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో దోపిడీ, అరాచకాలు లేని రోజంటూ లేదన్నారు. పొత్తుల కారణంగా ఎలమంచిలిలో టిడిపి నేత ప్రగడ నాగేశ్వరరావుకు సీటు కేటాయించడం కుదరలేదని, ఆయనకు సరైన ప్రాధాన్యత ఇవ్వబడుతుందని చెప్పారు. ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డికి తిరిగి తలదన్నేలా రోజులు వస్తాయన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ ఎస్ఇజెడ్, నాబ్ నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, టిడిపి నాయకులు ప్రగడ నాగేశ్వరరావు, రాజాన రమేష్ కుమార్, బుద్ద నాగ జగదీష్, ఆడారి మంజు, జనసేన నాయకులు జనపరెడ్డి శ్రీనివాసరావు, బయలపూడి రామదాసు, నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల ఫిర్యాదులకు గ్రీవెన్స్ కేంద్రం

ప్రజాశక్తి-అనకాపల్లి

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లా కలెక్టరు కార్యాలయంలో ఎన్నికల గ్రీవెన్స్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు కమాండ్ కంట్రోల్ కేంద్రం నోడల్ అధికారి, మత్స్యశాఖ డి.డి పి.ప్రసాదు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టోల్ ఫ్రీ నెంబర్ 1950, ల్యాండ్ లైన్ ఫోన్ నెంబర్ 08924-226599లకు ఫోన్ చేసి ఎన్నికలకు సంబంధించి ఏ గ్రీవెన్స్ నైనా తెలియజేయవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో ఎన్నికలకు సంబంధించి గ్రీవెన్స్ తెలియజేయడానికి 24 గంటలు అందుబాటులో వుంటుందని తెలిపారు.

భూమిని సారవంతం చేసుకోవాలి


ప్రజాశక్తి-కశింకోట

వ్యవసాయ భూమిని సారవంతం చేసుకోవాలని భూసార పరీక్షా శాస్త్రవేత్త బి.శ్రీహరిరావు అన్నారు. కశింకోట మండలం వెదురుపర్తి గ్రామంలో బిసిటి-కెవికె ద్వారా భూసార పరీక్ష శాస్త్రవేత్త బి శ్రీహరిరావు ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం భూమిలో సారం లేక దిగుబడులు రావడం లేదన్నారు. ఇటువంటి పరిస్థితులలో భూమిని సారవంతంగా చేయడం ప్రకృతి వ్యవసాయ విధానంతోనే సాధ్యమవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా గణజీవామృతం, ద్రావజీవామృతం తయారు చేయించారు. కొన్ని రకాల పురుగులు, తెగుళ్లకు అగ్నిహస్త్రం, బ్రహ్మహస్త్రం రైతులతో తయారు చేయించారు. ఈ విధంగా పొలాలలో తయారు చేసుకొని భూమిని కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వివిఎల్ సిందూజ, గ్రామ సర్పంచ్ సనివాడ అరుణ, రైతు క్లబ్ కన్వీనర్ ముక్కా పాండురంగా, కో-కన్వీనర్ వెలుగుల ఈశ్వరుడు, బిసిటి సామాజిక కార్యకర్త పిఎ నాయుడు, ఏ సుధాకర్, ఏ హరి, 55 మంది రైతులు పాల్గొన్నారు.

పాలిసెట్ స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి- కశింకోట

కశింకోట రాజీవ్‌గాంధీ ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ హాజరయ్యే విద్యార్థులకు కోచింగ్‌తో పాటు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను ప్రిన్సిపల్ కే.శివ బుధవారం పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శివ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి ర్యాంకను పొందాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9063297220, 9505504220 నెంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో విభాగ అధిపతులు గణేష్, రమణ కుమార్, శివరాం, జగన్మోహిని, వీరేంద్ర, జగదీష్, జనార్ధన్, పాలిటెక్నిక్ సిబ్బంది పాల్గొన్నారు.



పాలిసెట్ మెటీరియల్ పంపిణీ చేస్తున్న దృశ్యం

ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్‌లో

అయ్యన్న విద్యార్థులకు రాష్ట్రస్థాయి అవార్డులు

ప్రజాశక్తి-కె.కోటపాడు

ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ - 2024లో కె.కోటపాడు అయ్యన్న స్కూల్ విద్యార్థులు ప్రతి ఏటా లాగే ఈ ఏడాది రాష్ట్రస్థాయిలో తమ ప్రతిభను కనబరిచి స్కాలర్ షిప్స్, ఎక్సలెన్స్ అవార్డ్స్‌ను పొందారు. ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ టెస్ట్ మొదటి రౌండ్ గత ఏడాది సెప్టెంబర్‌లో జరిగింది. ఈ సంవత్సరం జనవరిలో రెండో రౌండ్ టెస్ట్ జరిగింది. ఈ టాలెంట్ టెస్ట్‌లో మాథ్స్‌లో 7వతరగతి విద్యార్థి రాయవరపు చైతన్యరామ్ స్టేట్ 5వ ర్యాంక్ సాధించి టాపర్‌గా నిలిచి స్కాలర్ షిప్‌నకు అర్హత సాధించాడు. 3వ తరగతి విద్యార్థి బండారు కుసుమ 9వ ర్యాంక్ సాధించి స్టేట్ టాపర్స్‌గా నిలిచింది. 1వ తరగతి విద్యార్థిని రొంగలి హేమశ్రీ 11వ ర్యాంక్, 4వ తరగతి విద్యార్థి కర్రి చాతుర్య 17వ ర్యాంక్‌లు సాధించి ఎక్సలెన్స్ మెడల్ అవార్డ్స్ సాధించారు. సైన్స్‌లో 8వ తరగతి విద్యార్థిని బొడ్డు సౌజన్య 14వ ర్యాంక్, 7వ తరగతి విద్యార్థిని రొంగలి చైత్రప్రియ 18వ ర్యాంక్‌తో ఎక్సలెన్స్ అవార్డులు సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టరు ఖాశీం అభినందించారు. ఈ సందర్భంగా డాక్టరు ఖాశీం మాట్లాడుతూ భవిష్యత్‌లో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా నేషనల్ అనలైటికల్ అప్టిట్యూడ్ టెస్ట్ (నాట్), ఒలింపియాడ్స్, నవోదయ, సైనిక్ స్కూల్ పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తామన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఉత్తమ ఫలితాలు సాధించడం స్కూల్‌కు ఎంతో గర్వంగా ఉందన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.



రాయవరపు చైతన్యరామ్, బండారు కుసుమ, రొంగలి హేమశ్రీ, కర్రి చాతుర్య, బొడ్డు సౌజన్య, రొంగలి చైత్ర ప్రియ



కంటి ఆపరేషన్లకు ఎంపికైన వారితో నిర్వాహకులు

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి -అనకాపల్లి డెస్క్

బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో ఎన్ఆర్ఐ కేర్ సెంటర్ (విజన్ సెంటర్) ఆధ్వర్యాన బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఇందులో 65 మంది కంటి రోగులను పరీక్షలు చేయగా 22 మందికి కంటి ఆపరేషన్ ఎంపిక చేసి వారిని విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి వారి బస్‌లో తరలించారు. వారికి కంటి ఆపరేషన్లు ఉచితంగా చేయిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జాన్, శంకర్ ఫౌండేషన్ క్యాంపు కో ఆర్డినేటర్ అరుణ్ కుమార్, వైద్య సిబ్బంది, ఎన్ఆర్ఐ కేర్ సెంటర్ ప్రతినిధి నాయుడు, రాజు పాల్గొన్నారు.

అనకాపల్లి : సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నెలవారి సమావేశం సందర్భంగా అనకాపల్లిలోనిజార్జి క్లబ్ ఆవరణలో బుధవారం రాజమండ్రి గౌతమి నేత్రాలయం వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ పి సత్యవతి ఐ క్యాంప్ కోఆర్డినేటర్ బి కమలేష్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు జరిపించి మందులు, కళ్లజోళ్ళు తక్కువ రేటుకు సరఫరా చేశారు. వైద్య శిబిరంలో హాజరై ఆపరేషన్ చేయటానికి తమ సంస్థ సిద్ధంగా ఉందని గౌతమి నేత్రాలయం ప్రతినిధులు తెలిపారు. అనంతరం సుమారు 15 మంది అసోసియేషన్ సభ్యులకు జన్మదిన వేడుకలు జరిపించి కేక్ కట్ కట్ చేయించారు. సంస్థ అధ్యక్షులు గొరిపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో డాక్టర్ ఎంబి వి స్వామి కే లక్ష్మణరావు మల్ల చంద్రశేఖర్ వీరభద్ర రావు నల్లల దేవుళ్ళు ప్రసంగించారు. సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సుమారుగా 150 మంది పాల్గొన్నారు.


తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి- కశింకోట

కశింకోట మండలం తాళ్లపాలెం జంక్షన్ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారు జామున రెండు లారీలు ఢీకొన్నాయి. విశాఖపట్నం నుండి మాకవరపాలెం కంపెనీకి వెళ్తున్న లారీ, రాజమండ్రి నుండి విశాఖపట్నం వస్తున్న ఇసుక లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. జాతీయ రహదారి కావడంతో ఎక్కువ సంఖ్యలో రెండు వైపులా వాహనాలు వస్తూ ఉంటాయి. అయితే ఈ సంఘటన జరిగిన సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ సంఘటనతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. ఏం జరిగిందోనని ఆందోళన చెందారు. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే క్రేనుతో రోడ్డు మీద ఉన్న లారీలను తొలగించారు. సంఘటన స్థలానికి కశింకోట సిఐ వినోద్ బాబు వచ్చి పరిశీలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని ఆరిపాక పంచాయితీ శివారు పెదయాతపాలెంలో కాళ్ళ శ్రీనివాసరావు, ఆడారి వెంకట్ ఆధ్వర్యంలో పలువురు మంగళవారం రాత్రి జనసేన పార్టీలో చేరారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జనసేన పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థిని అత్యధికమెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నేతలు ఇందల వెంకటరమణ, బలిరెడ్డి అప్పారావు, కర్రి కనకరాజు, గండి దుర్గాప్రసాద్, పిన్నమరాజు సత్యనారాయణ రాజు, కర్రి నరసింగరావు, వనం సత్యనారాయణ, మామిడి శంకరరావు పలువురు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



రమేష్‌బాబును సత్కరించిన పెదయాతపాలెం గ్రామస్తులు

ఎన్నికల్లో టిడిపి కూటమికి తగిన గుణపాఠం

- ఆ పార్టీ ఫిర్యాదుతోనే పింఛన్‌దారులకు ఇక్కట్లు
- అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి

ప్రజాశక్తి-అనకాపల్లి

వృద్ధులు, వికలాంగులు, వితంతు పింఛన్‌దారులు రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమికి తగిన బుద్ధి చెబుతారని అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బీవీ సత్యవతి అన్నారు. స్థానిక రింగ్ రోడ్‌లో వైసీపీ క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హామీల్లో భాగంగా ప్రతి నెల ఒకటవ తేదీనే వాలంటీర్ల ద్వారా ఇంటికి వెళ్లి వృద్ధులకు, వికలాంగులకు వితంతువులకు పింఛను అందించేవారని తెలిపారు. కాని ఎన్నికల కమిషన్‌కు టిడిపి ఫిర్యాదుతో వాలంటీర్లను తప్పించారని, దీంతో పింఛన్దారులకు మూడు రోజుల పింఛన్ ఆలస్యం అవ్వడంతో పాటు సచివాలయాలకు వెళ్లి తీసుకోవడం తీసుకోవాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పించిన్దారులు రానున్న ఎన్నికల్లో టిడిపి జనసేన బిజెపి ఓటమికి తగిన బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్, ఏపీఐడబ్ల్యుసి చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, కసింకోట జడ్పిటిసి దంతులూరి శ్రీధర్ రాజు, కలగా గున్నయ్య నాయుడు, జాజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, వైసిపి నాయకులు ప్రసాద్, దిలీప్‌కుమార్ తదితరులు

ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా

రైవాడ ప్రాజెక్టుకు జంగిల్ క్లియరెన్స్ చేయించాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి

రైవాడ ప్రాజెక్టు గట్టు పెద్ద పెద్ద చెట్లు, తుప్పలతో నిండిపోయి ఉందని, ఉపాధి హామీ పథకం ద్వారా జంగిల్ క్లియరెన్స్ చేయించి ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వేలది ఎకరాలకు సాగునీరు, లక్షలాది మందికి తాగునీటిని అందిస్తున్న రైవాడ ప్రాజెక్ట్ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రాజెక్టులకు ఒక్కరూపాయి కూడా ఖర్చు చేయలేదని పేర్కొన్నారు. ప్రాజెక్ట్ చుట్టూ చెట్లు పెరిగిపోవడంతో వేళ్ళు భూమిలోకి వెళ్లి గట్టు గుళ్ళ బారి ప్రాజెక్టుకు ప్రమాదం ఏర్పడే ప్రమాదం ఉందని తెలిపారు. మండలంలోని పది పంచాయతీలను ఎంపిక చేసి, ఉపాధి హామీ కూలీల చేత జంగిల్ క్లియరెన్స్ చేయిస్తే వేలాది మంది కూలీలకు పని కల్పించడంతో పాటు ప్రాజెక్టును అభివృద్ధి చేయవచ్చని పేర్కొన్నారు. దీని కోసం ఎన్ఆర్ఇజిఎస్ అధికారులు ఎస్టిమేషన్ వేసి జిల్లా కలెక్టర్ నుండి ప్రత్యేక అనుమతి తీసుకోవాలని కోరారు.

వైభవంగా కల్యాణరాట మహోత్సవం

ప్రజాశక్తి- మునగపాక : స్థానిక పల్లపు వీధిలో గల సాంబమూర్తి స్వామి దేవాలయ నాలుగవ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా బుధవారం దేవస్థానం ప్రాంగణంలో కళ్యాణరాట మహోత్సవం వైభవంగా జరిగింది. ముందుగా కళ్యాణరాట వేసిన తదుపరి వార్షికోత్సవ వేడుకలు ప్రారంభం కానున్నాయని దేవస్థానం చైర్మన్ బూడిద శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, అలంక ప్రకాశరావు, బూడిద రామారావు, మా ఊరి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు సహకరించండి

ప్రజాశక్తి- మనకుపాక : అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు నిర్మాణ పనులు 4వ తేదీ గురువారం నుండి ప్రారంభం కానున్న సందర్భంగా ట్రాఫిక్ రద్దీ కారణంగా భారీ వాహనదారులు సహకరించాలని రోడ్డు పునర్నిర్మాణ పోరాట కమిటీ బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. నిర్మాణం చేపడుతున్న కార్మికులకు ఎటువంటి ఆటంకం, అసౌకర్యం కలగకుండా కాంట్రాక్టర్ కోరిన మీదట రోడ్డు నిర్మాణం పూర్తయ్యేవరకు అనకాపల్లి బైపాస్ రోడ్డు నుండి మునగపాక బైపాస్ రోడ్డు వరకు కేవలం ద్విచక్ర వాహనాలు మాత్రమే రోడ్డు మార్గంలో తిరిగేందుకు అనుమతినివ్వడం జరిగిందని, దీనిని అందరూ పాటించాలని కోరారు.

రక్షిత మంచినీటి పథకానికి కొత్త మోటారు

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని ఉగ్గినిపాలెం గ్రామంలో రక్షిత మంచినీటి పథకానికి నూతన మోటార్‌ను బుధవారం గ్రామ సర్పంచ్ కలగ గున్నయ్యనాయుడు వేయించారు. గ్రామంలో మంచి నీటి సమస్య తలెత్తకుండా మంచినీళ్లు అందించేందుకు ఈ మోటార్ వేయించినట్లు చెప్పారు. ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దామని తెలిపారు. వీధి దీపాలు కూడా వేయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-కె.కోటపాడు

స్థానిక రెవెన్యూ కార్యాలయం ఆవరణలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తహశీల్దారు రమణమ్మ ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రతిరోజు అనేకమంది ఈ కార్యాలయానికి వివిధ రకాల పనులపై వస్తుంటారని, వారంతా దాహార్తితో ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో ఈ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.

గుల్లేపల్లిలో పైలా ప్రసాదరావు ప్రచారం

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలోని గుల్లేపల్లి గ్రామంలో టిడిపి, బిజెపి, జనసేన కూటమి మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం కావాలంటే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రొంగలి మహేష్, సబ్బవరపు రామునాయుడు, సర్పంచ్‌లు పూడి నారాయణమూర్తి, దాడి ఎరుకు నాయుడు, వెలగల పైడంనాయుడు, బోలెం బుల్లిదొర, బండారు నరసింహనాయుడు, బాలిబోయిన సంతోష్, కడుపుట్ల గంగరాజు, కొట్టాన ఈశ్వరరావు, రాళ్లపల్లి దేముడు, ఎంపీటీసీ కసిరెడ్డి దేముడు బాబు ఇతర నాయకులు పాల్గొన్నారు.



ఓటర్లను అభ్యర్థిస్తున్న టిడిపి అభ్యర్థి పైలా ప్రసాదరావు

కాఫీ విత్ కేడర్‌లో పాల్గొన్న కొణతాల



కాఫీ విత్ కేడర్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ

ప్రజాశక్తి-అనకాపల్లి

మండలంలోని వల్లూరు, ఎరుకవానిపాలెం, రాజుపాలెం గ్రామాల నాయకులతో బుధవారం నిర్వహించిన కాఫీ విత్ కేడర్ కార్యక్రమంలో టిడిపి, బిజెపి, జనసేన కూటమి అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కొణతాల గతంలో చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి సీఎం.రమేష్ తనయుడు రిత్విక్, మూడు పార్టీల నాయకులు బుద్ధ నాగజగదీష్, డాక్టర్ నారాయణరావు, బొడ్డేడ జోగి నాయుడు, బొడ్డేడ నాగేశ్వరరావు, మళ్ల శ్రీను, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో ప్రచారం

ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ, ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌ను గెలిపించాలని కోరుతూ బుధవారం పాత 16వ వార్డు దాడి భోగలింగం నాయుడు వీధి, రెడ్డి ఆదినారాయణ వీధి, బొత్స వారి వీధి, ట్రాఫిక్ డౌన్, సాగి సుబ్బరాజు వీధి, కరెంట్ ఆఫీస్ వీధుల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మూడు పార్టీల నాయకులు కొణతాల వెంకటరావు, కొణతాల లక్ష్మీనారాయణ కుమారుడు బాల సుబ్రహ్మణ్యం, కొణతాల అప్పలరాజు, బుద్ధ రాజేష్, దొడ్డ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశంలో

రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి బుద్ధ కాశీ ,నోబుల్ టీచర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులతో అనకాపల్లి జార్జ్ క్లబ్ ఆవరణలో బుధవారం జరిగిన సమావేశంలో కూటమి అభ్యర్థి కొణతాల రామకృష్ణ పాల్గొన్నారు. పెన్షనర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను రామకృష్ణ దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని రామకృష్ణ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గొరిపతి ఎన్ఎస్ బోసు, ఆడారి గంగాధర్, కర్రి శివ బలరాం పాల్గొన్నారు.

గవరపాలెంలోని మాజీ శాసనసభ్యులు పీలా గోవింద్ కార్యాలయంలో 81వ డివిజన్ సమావేశం బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వినర్ మల్ల సురేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కసిరెడ్డి ప్రసాద్, కొణతాల సంతోష అప్పారావు నాయుడు, కాండ్రేగుల జోగేంద్ర ఇతర నాయకులు పాల్గొన్నారు.

కొణతాలను కలిసిన జైవీర్

స్థానిక రింగ్ రోడ్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం కూటమి అభ్యర్థి కొణతాల రామకృష్ణను మాజీ మంత్రి దాడి వీరభద్రరావు తనయుడు దాడి జైవీర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

బిజెపి ఎంపీ అభ్యర్థి సిఎం రమేష్‌ను ఓడించాలి

- వైసిపి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: కడప జిల్లా నుంచి తీసుకువచ్చిన బిజెపి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ అహంకారిని, చిత్తుచిత్తుగా సీఎం రమేష్‌ను ఓడించాలని అనకాపల్లి వైసీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు కోరారు. బుధవారం నర్సీపట్నం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు మాట్లాడుతూ, తాను రైతు బిడ్డనన్నారు. వార్డు మెంబర్ నుంచి పార్లమెంట్‌కు పోటీ చేసే స్థాయికి ఎదిగానన్నారు. తనను ఈ స్థాయికి నిలబెట్టిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. తాను స్థానికుడిని, నిరంతరం మీకు అందుబాటులో ఉంటానని, ఎప్పుడు ఫోన్ చేసినా స్వయంగా ఫోన్ రిసీవ్ చేస్తానన్నారు. గతంలో అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో పోటీ చేసిన స్థానికేతరులైన నూకారపు సూర్యప్రకాష్‌రావు, అల్లు అరవింద్‌లు ఎంపీగా పోటీ చేస్తే అనకాపల్లి ప్రజలు ఓడించారని గుర్తు చేశారు. అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఓటర్లు, ప్రజలు విజ్ఞత కలిగిన వారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బూడి



మాట్లాడుతున్న చింతకాయల విజయ్

వాలంటీర్ల జీవితాలతో ఆటలు

- టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: నర్సీపట్నం మండలంలో వాలంటీర్ల జీవితాలతో ఎమ్మెల్యే గణేష్ ఆటలాడుతున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, నర్సీపట్నం మున్సిపాలిటీ 22వ వార్డు వెంకునాయుడుపేటలో వైసీపీ నాయకుడు రాంగోపాల్ ఇంట్లో వాలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేసి వారితో దొంగ పనులు చేయించడానికి ఎమ్మెల్యే సిద్ధమయ్యారన్నారు. డబ్బులు పంచాలని వాలంటీర్లకు చెబితే కొంత మంది వాలంటీర్లు నిలదీశారన్నారు. అర్ధరాత్రి సమయాల్లో రాజకీయాలు ఏమిటని ప్రశ్నించారు. మద్యం, ఇసుకపై సంపాదించిన డబ్బులను పంచడానికి సిఎం జగన్ సిద్ధమయ్యారన్నారు. వాలంటీర్లకు అన్యాయం జరిగితే ఎమ్మెల్యే కనీసం వారికి అండగా ఉండకుండా కారు ఎక్కి వెళ్లిపోవడం దారుణమన్నారు. వాలంటీర్లు ఇప్పటికైనా ఆలోచన చేయాలని, ఎమ్మెల్యే చెప్పిన మాటలు నమ్మి కష్టాలు కొని తెచ్చుకోవద్దని చెప్పారు.

వేర్వేరు చోట్ల రోడ్డు ప్రమాదాలు

- నలుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలం కేంద్రంలో బుధవారం జరిగిన రెండు వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాలలో నలుగురుకి తీవ్ర గాయలయ్యాయి. తట్టబంద గ్రామానికి చెందిన కట్టా ప్రసాద్ మధ్యాహ్నం ద్విచక్ర వాహనం పై కింతలిలో వివాహానికి వెళుతుండగా రావికమతం సమీపంలో బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ప్రసాద్ ముఖం పై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు రావికమతం పిహెచ్‌సికి తరలించి ప్రథమ చికిత్స చేయించి నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు.



గాయపడ్డ బాధితుడు

రావికమతం ఏపిజివిబి బ్యాంకు సమీపంలో ముందు వెళుతున్న బైక్‌ను డీ కొన్న సంఘటనలో ముగ్గురుకి గాయాలయ్యాయి. పి.పొన్నవోలు గ్రామానికి చెందిన లంక తేజ, గంట్ల నవీన్ బైక్ పై వెళుతూ ముందు వెళుతున్న మరొక బైక్‌ను బలంగా డీ కొట్టారు. ఈ ప్రమాదంలో ముందు బైక్ పై వున్న మలిచేట్ల పరమేశ్వరి, ఆమె భర్త దేముళ్లు కు తీవ్ర గాయాలు కాగా, బైక్ ను డీ కొట్టిన వేణుకు కూడా గాయాలయ్యా యి. గాయపడిన బాధితులను 108లో నర్సీపట్నం ఆసుపత్రికి తరలించారు.

5న నూకాలమ్మ ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి -చీడికాడ: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన నూకాలమ్మ తల్లి ఆలయాన్ని ఈనెల 5వ తేదీన శుక్రవారం ప్రారంభిస్తున్నట్లు ఆలయ నిర్మాణ కర్తలు డోకల, పరవాడ కుటుంబీకులు తెలిపారు. మండల కేంద్రంలో గతంలో ఉన్న ఆలయాన్ని అభివృద్ధి పరిచి భారీ స్థాయిలో నిర్మించాలని భావించి గ్రామ ప్రజల సహకారంతో నిర్మించారు. ఆలయ ప్రారంభోత్సవానికి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు హాజరవుతున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న పెద్దాడ లోవరాజు

జగ్జీవన్‌రామ్ జయంతిని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-గొలుగొండ మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతిని ఈ నెల 5న జయప్రదం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దాడ లోవరాజు, జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ డిసిహెచ్.రాజుబాబు కోరారు. బుధవారం గొలుగొండ మండలం కొంకసింగి గ్రామంలో విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 11వ తేదీన జ్యోతిరావుపూలే, 14న ప్రపంచ మేధావి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతులను కూడా జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు కృష్ణ, రమణ, నాగేశ్వరరావు, వరహాలు, రాజు, మూర్తి పాల్గొన్నారు.

పలు పోలింగ్ కేంద్రాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-రోలుగుంట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తహశీల్దార్ రవిచంద్ర మండలంలోని బుచ్చంపేట, జె.నాయుడుపాలెం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ సౌకర్యాలపై ఆరా తీశారు. కేంద్రాల వద్ద ర్యాంపనులు, మరుగుదొడ్లు, విద్యుత్, తాగునీటి సదుపాయం ఉండాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఆర్ఐ రామ్మూర్తి ఉన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అక్రమ కట్టడాలు పరిశీలన



ఆక్రమణలను పరిశీలిస్తున్న తహసిల్దార్

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి -కోటవురట్ల: ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని తహసిల్దారు వెంకటరమణ హెచ్చరించారు. ప్రజాశక్తి పత్రికలో యదేచ్ఛగా అక్రమ కట్టడాలు పేరుతో బుధవారం కథనానికి ఆయన స్పందించారు. సిబ్బందితో కలిసి గెడ్డ సమీపంలో అక్రమ కట్టడాలను పరిశీలించారు, సుమారు 38 మంది అక్రమ కట్టడాలు నిర్మాణాలు చేపట్టారని వారందరికీ ఆక్రమణల యాక్ట్ ప్రకారం నోటీసులు అందజేస్తామన్నారు. అదేవిధంగా వారందరితో సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించడంతో పాటు హెచ్చరికలు జారీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఉర్ధవరావు, సచివాలయ కార్యదర్శి శ్రీనివాస్, సతీష్, గ్రామ రెవెన్యూ అధికారి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కూలీలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - చీడికాడ: ఉపాధి పనికి వెళ్లే కూలీలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో ఉమామహేశ్వరి తెలిపారు. మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఉపాధి పనికి వెళ్లే వారందరూ ఉదయాన్నే వెళ్లి 10 గంటలకు పని ముగించుకోవాలని సూచించారు. ఇలాగైతే వడదెబ్బకు గురికాకుండా ఉంటారని అన్నారు. ప్రతి ఒక్కరు కూడా తాగే నీరు సమకూర్చుకోవాలని, పని ప్రదేశంలో తాటాకు పందిళ్లను నిర్మించుకోవాలని, హెల్త్ సిబ్బంది ద్వారా పని సమయంలో అవసరమగు మందులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. మండలంలో అన్ని గ్రామాల్లో కలిపి రోజుకు 10 వేల మంది తగ్గకుండా ఉపాధి పనికి హాజరు అయ్యేటట్లు చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు తెలిపారు. జూన్ నెలాఖరుకు నాలుగు లక్షల మంది పని దినాలు పూర్తి అయ్యేటట్లు చూడాలన్నారు. ఈ సమావేశంలో ఏపీవో నాగరాజు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ

రామాలయంలో విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి- నక్కపల్లి: మండలంలోని ఉపమాక మెరకవీధి రామాలయంలో రాములోరి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంను వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన తోట అప్పారావు సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి ఇత్తడి ఉత్సవ మూర్తులను బహుకరించారు. ఈ మేరకు బుధవారం ఉదయం ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగించారు. అనంతరం రామాలయంలో అర్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు , సంఘర్షణపల్లి కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేస్తే చర్యలు

-సిఐ విజయ్ కుమార్

ప్రజాశక్తి- నక్కపల్లి: కొత్త అమావాస్య ,నూకాలమ్మ తల్లి జాతర సందర్భంగా గ్రామాల్లో అసాంఘిక, అశ్లీల కార్యక్రమాలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని సిఐ విజయ్ కుమార్ హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పండుగ సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినా తప్పనిసరిగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుమతులు పొందాలన్నారు. అన్ని గ్రామాల్లోనూ నిఘా పెట్టామన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతీ ఒక్కరూ పండుగను సంతోషంగా, ఆనందంగా జరుపుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న సిఐ

మన్యంలో వర్షం

ప్రజాశక్తి-అరకులోయ: పర్యాటక కేంద్రమైన అరకులోయలో బుధవారం మధ్యాహ్నం తొలకరి వాన కురిసింది. ఎండ తీవ్రతతో గిరిజనులు అల్లాడుతుండగా వాన కురవడంతో ఈ ప్రాంత వాసులు సేద తీరారు. ఇంతవరకు తీవ్రమైన ఎండ వేడిమితో ఉక్కిరి బిక్కిరి అవుతున్న మన్యప్రాంత వాసులకు తొలకరి వాన పలకరించడంతో ఈ ప్రాంతమంతా ఒక్కసారిగా చల్లబడింది. అరకులోయను సందర్శించే పర్యాటకులు సైతం ఆనందించారు. ఈ ఏడాది మునుపెన్నడు లేని విధంగా మామిడి పూత వచ్చింది. సరైన సమయానికి వర్షం రాకపోవడంతో దిక్కులు చూస్తున్న రైతులకు ఈ తొలకరి వర్షం ఎంతగానో ఉపయోగపడిందని పలువురు రైతులు అన్నారు. ఉరుములు మెరుపులతో వాన కురవడంతో వర్షపు నీటితో రోడ్లన్నీ నిండాయి.

డుంబ్రిగుడ: మండలంలో బుధవారం తొలకరి వర్షం కురిసింది. కొన్ని నెలలుగా వర్షం కురవక పోవడంతో పాటు వేసవికాలం ప్రారంభం నుంచి భానుడి ప్రతాపానికి ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. ఎండల తీవ్రతతో గిరిజనులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. బుధవారం మధ్యాహ్నం తొలకరి వర్షం కురవడంతో వాతావరణం కొంత చల్లబడటంతో మండల వాసులు కొంత ఉపశమనం పొందారు.



అరకులోయలో కురుస్తున్న వర్షం

విశాఖలో శ్రీముఖి సందడి

-కళామందిర్ సంస్థ రసమయి

సిల్వర్ జ్యూయలరీ విభాగం ప్రారంభం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: ప్రముఖ యాంకర్ మరియు సినీ నటి శ్రీముఖి బుధవారం ఉదయం విశాఖలో సందడి చేసింది. సిరిపురం సమీపంలోని సాయి సిల్క్ కళామందిర్ నూతనంగా ఏర్పాటు చేసిన రసమయి ఫైన్ సిల్వర్ జువెలరీ షోరూమ్ మొదటి శాఖను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, రెండు తెలుగు రాష్ట్రాలలో వస్త్ర వ్యాపారంలో ఎంతో ప్రసిద్ధిగాంచిన కళామందిర్ వెండి వ్యాపారంలో అడుగు పెడుతున్నందుకు శుభాకాంక్షలు తెలిపారు. రసమయి సిల్వర్ జ్యువెలరీ షోరూంలో టెంపుల్ జ్యువెలరీ, యాంటిక్ నక్షి ఆభరణాలు, సీజెడ్ జ్యువెలరీ, విక్టోరియన్, కుందన్, మొయిసానైట్, అల్ట్రా ప్రీమియం లైట్ వెయిట్ జ్యువెలరీ వంటి అధునాతన మోడల్స్ అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న శ్రీముఖి

అనంతరం కళామందిర్ సంస్థ ఎండి మోహన్ మాట్లాడుతూ ఇప్పటికే విశాఖలో కళామందిర్ వస్త్ర దుకాణానికి మంచి పేరు ప్రతిష్టలు ఉన్నాయన్నారు. అదే షోరూంలో గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్లో ఈ బంగారు ఆభరణాలను షోరూమ్ ను ఏర్పాటు చేశామన్నారు. తమ షో రూమ్ లో మార్కెట్ ధరల కన్నా అతి తక్కువ ధరలకు అధునాతన మోడళ్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కళ్యాణ్, రాజేష్, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

గాజాలో ఇజ్రాయిల్ దాడిని ఖండించండి

- ఆవాజ్ పిలుపు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: గాజా లో ఇజ్రాయిల్ పైశాచిక దాడిని ఖండించాలని ఆవాజ్ నగర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్ అహద్, అశ్రఫ్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఆహారం పంపిణీ చేస్తున్న సంస్థ పైన దాడులు చేసి వరల్డ్ సెంట్రల్ కిచెన్ కు చెందిన ఏడుగురు మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. ఈ చర్యను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇజ్రాయిల్ దురాగతాలను అడ్డు అదుపు లేకుండా పోతుందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే గాజాలో విచక్షణారహితంగా జరుగుతున్న కాల్పులను ఆపాల్సిందిగా అంతర్జాతీయ సమాజాన్ని కోరారు. వివిధ దేశాలకు చెందిన ఏడు మంది పౌరులు చనిపోవడం చాలా విషాదకరం, బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆహారాన్ని అందకుండా చేయడాన్ని ఒక ఆయుధంగా ఉపయోగించుకోవడం ఇజ్రాయిల్ దాష్టికానికి అద్దం పడుతుందని విమర్శించారు. గాజాలో ప్రజలకు అవసరమైన ఆహార సరఫరా అందించడానికి వచ్చిన బృందం పై ఇజ్రాయిల్ ఇలా దారుణంగా దాడికి దిగి వారిని పొట్టన పెట్టుకోవడం దుర్మార్గమన్నారు.



అవగాహన కల్పిస్తున్న సిఐ విజయ్ కుమార్

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - నక్కపల్లి: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సిఐ విజయ్ కుమార్ సూచించారు. మండలంలోని ఉపమాకలో బుధవారం రాత్రి పలు అంశాలపై యువతకు అవగాహన కల్పించారు. బైక్, కారు, ఆటో, ఇతర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా రహదారి నియమ నిబంధనలను పాటించాలని సూచించారు. ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. నేరాలు ,చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అందరూ ఎన్నికల నియామావళి ని పాటించాలని తెలిపారు.

పింఛన్ల కోసం పడిగాపులు

-సచివాలయాల వద్ద గంటల తరబడి నిరీక్షణ



నర్సీపట్నంలో వేచివున్న పింఛనుదారులు

ప్రజాశక్తి-గొలుగొండ: రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం నుంచి సామాజిక పింఛన్ పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ మేరకు గొలుగొండ మండలం ఏజెన్సీ లక్ష్మీపురం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పింఛన్ల కోసం వృద్దులు, వితంతువులు, వికలాంగులు పడిగాపులు కాశారు. ఉదయం నుంచి ఇక్కడ ఇదే పరిస్థితి నెలకొంది. పింఛన్ సొమ్ము కోసం అధిక సంఖ్యలో కార్యాలయానికి రావడంతో ఈ ప్రాంతమంతా పింఛన్ దారులతో నిండిపోయింది.

ఎస్.రాయవరం : మండలంలోని మత్స్యకార గ్రామమైన కొత్త రేవుపోలవరం సచివాలయం వద్ద పెన్షన్ కోసం వృద్దులు పడిగాపులు కాశారు. బుధవారం ఉదయం పదిగంటల సమయానికి గ్రామంలోని వృద్ధులు, వికలాంగులు, వితంతువులు తమ నెలవారీ పెన్షన్ నిమిత్తం సచివాలయం వద్దకు వచ్చి ఎదురు చూశారు. సచివాలయ కార్యాలయానికి తాళం వేసి ఉండటంతో పెన్షన్దారులు మండుటెండలో ఎదురు చూస్తూ పడిగాపులుకాసారు.

అనకాపల్లిడెస్క్: నర్సీపట్నం మున్సిపాలిటీలోని సచివాలయాల వద్ద పెన్షన్ దారులు బారులు తీరారు. 17 నెంబర్ సచివాలయం వద్ద వెల్ఫేర్ అసిస్టెంట్ పవన్ మాట్లాడుతూ, పెన్షన్ దారులకు ప్రత్యేకంగా టెంట్ సౌకర్యం ఏర్పాటు చేసి మంచినీటిని అందజేస్తామన్నారు. కాగా మున్సిపాలిటీలో 7,125 మంది పెన్షన్ దారులు ఉన్నట్లు మున్సిపల్ కమిషనర్ రవిబాబు తెలిపారు.

తుమ్మపాలలో 50 శాతం పంపిణీ

అనకాపల్లి : తుమ్మపాల మేజర్ పంచాయతీలో మొత్తం మూడు సచివాలయాల పరిధిలో 1894 పింఛన్లు



గొలుగొండలో నిరీక్షిస్తున్న పింఛనుదారులు

ఉన్నాయి. బుధవారం మధ్యాహ్నం బ్యాంకు నుంచి డబ్బులు డ్రా చేసి తీసుకొచ్చారు. అయితే పంపిణీ సమయంలో సర్వర్లు మొరాయించిన కారణంగా తొలి రోజు 900 పింఛన్లను పంపిణీ చేశారు. పింఛన్ల కోసం ఉదయం నుంచి సచివాలయాల వద్ద వృద్ధులు, వికలాంగులు వితంతువులు నిరీక్షించారు.

సాయంత్రం పంపిణీ

అచ్యుతాపురం : అచ్యుతాపురం మండలంలో అన్ని రకాల



చోడవరంలో..

పింఛన్లు 11,210 ఉండగా, దుప్పుతూరు గ్రామ సచివాలయం పరిధిలోని రెండు పంచాయతీల్లో 519 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి బ్యాంక్ ఆఫ్ ఇండియా, యాక్సిస్ బ్యాంకులో ద్వారా క్యాష్ తీసుకోవాల్సి ఉంది. ఒకేసారి గ్రామ సచివాలయాలకు చెందిన పింఛన్ సొమ్మును ఇవ్వడానికి ఆయా బ్యాంకులలో నగదు నిల్వలు లేకపోవడంతో మధ్యాహ్నం 2 గంటల వరకు దుప్పుతురు సచివాలయానికి క్యాష్ ఇవ్వలేదు. మధ్యాహ్నం మూడు గంటలకు సొమ్ము రావడంతో పింఛన్లు పంపిణీ చేపట్టారు.



భీమిలిలో పింఛను ఇస్తున్న అధికారులు

చోడవరం : ఒకటే తేదీ వచ్చిందంటే వాలంటీర్ల ద్వారా ఇంటి వద్దే పింఛను అందుకునే లబ్ధిదారులకు ఈసీ నిబంధనలతో కష్టాలు తప్పలేదు. చోడవరం నాలుగు సచివాలయాల వద్ద పింఛన్‌దారులు ఉదయం నుండి పడిగాపులు కాశారు. సచివాలయం సిబ్బంది



బుచ్చయ్యపేటలో..

మధ్యాహ్నం నగదును బ్యాంకు నుండి తీసుకొచ్చి పంపిణీ చేపట్టారు. ఎండలు విపరీతంగా కాగితంతో వృద్ధులు ఆపసోపాలు పడ్డారు.

బుచ్చయ్యపేట : మండలంలోని పలు సచివాలయంలో బుధవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. బ్యాంకుల నుండి పంచాయతీ అధికారులకు సాయంత్రం మూడున్నర గంటల సమయంలో నగదు అందింది. దీంతో నాలుగు గంటల తర్వాత పంపిణీ చేపట్టారు.

పింఛన్లు పంపిణీ

భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు పరిధి అప్పికొండ వీధిలో ఉన్న వార్డు సచివాలయలో బుధవారం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఇక్కడి సచివాలయంలో 344 పింఛనుదారులుండగా మధ్యాహ్నం 2.45 గంటల వరకు 145 పింఛన్లు అందజేసినట్లు సచివాలయ ఉద్యోగులు తెలిపారు. నడవలేని వృద్ధులు, వికలాంగులకు ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేస్తామని తెలిపారు. తాగు నీటి సదుపాయం కల్పించారు.

జివిఎంసి రెండో వార్డు పరిధి చిల్లపేటలో అనారోగ్యంతో మంచంపై ఉన్న వృద్ధురాలి ఇంటికి జోనల్ కమిషనర్ కె.కనకమహా లక్ష్మి వెళ్లి పింఛను అందజేశారు. ఆమె వెంట యుసిడి ఎపిడి ఎల్లపు సంతోష్‌కుమార్ ఉన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండల కేంద్రంలోని సచివాలయాన్ని జిల్లా ముఖ్య కార్య నిర్వహణాధికారి పోలినాయడు సందర్శించారు. సచివాలయంలో సిబ్బంది పంపిణీ చేస్తున్న పెన్షన్లు పరిశీలించారు. వృద్ధులకు మంచినీరు, కూర్చోవడానికి ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. ఆనందపురం పంచాయతీ పరిధిలోని పరిధిలోని 624 మందికి గాను 250 మంది మందికి పింఛన్లు ఇచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీరామ్ మూర్తి తెలిపారు. వృద్ధులు, వికలాంగులు 18 మందికి వారి ఇళ్ల వద్దనే పింఛన్ అందించేందుకు ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం బోని వాటర్ వర్క్ పరిశీలనకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అప్పలనాయుడు, కార్యదర్శి బాబి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్.రాయవరంలో,,,

పోస్టల్ బ్యాలెట్లపై అవగాహన ఉండాలి

జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: ఎన్నికల్లో భాగస్వామ్య మయ్యే అధికారులు, సిబ్బందికి అందజేసే పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై సంబంధిత అధికారులు అవగాహన కలిగి ఉండాలని, కింది స్థాయి సిబ్బందికి తెలియజేయాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సూచించారు. తూర్పు నియోజకవర్గ ఎన్నికల సిబ్బందితో బుధవారం సాయంత్రం తన ఛాంబర్లో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగం, శిక్షణ సదస్సులు తదితర అంశాలపై కింది స్థాయి అధికారులకు మార్గనిర్దేశం చేశారు. గురువారం జరిగే తొలి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ అనంతరం ఆయా నియోజకవర్గాలకు సిబ్బందిని కేటాయిస్తారని దాని ప్రకారం శిక్షణ సదస్సుల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 10, 11వ తేదీల్లో తొలి విడత శిక్షణ ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు. మే నెల 5వ నుంచి ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యమయ్యే అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా వారి ఓటు హక్కును వినియోగించుకుంటారని.. ఆ క్రమంలో ఇప్పటి నుంచే ప్రణాళికలు రచించుకోవాలని సన్నద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, సమన్వయంతో వ్యవహరించాలని చెప్పారు. ఓటింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా అన్ని స్థాయిల్లో అధికారులు, సిబ్బంది పూర్తి అవగాహన కలిగి తదుపరి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఈవిఎంల వినియోగం, ఓటింగ్‌పై తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో తూర్పు నియోజకవర్గ ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.